క్లుప్తంగా

వేసవిలో సిల్టు తొలగింపు పనులు ముమ్మరం

మేయర్ వెంకటేశ్వరమ్మ



మచిలీపట్నంటౌన్: ఈ వేసవిలో నగరంలోని మేజర్, మైనర్, కచ్చా డ్రెయిన్లలో సిల్టు తొలగింపు పనులను ముమ్మరంగా నిర్వహిస్తామని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం తెల్లవారుజామున నగరంలోని పలు డివిజన్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. వచ్చే వర్షాకాలంలో వర్షం నీరు సక్రమంగా పారేందుకు వీలుగా డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును తొలగిస్తామన్నారు. సిల్టు తొలగింపు పనుల్లో కార్మికులు అలసత్వం వహించవద్దన్నారు. కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కంచికచర్ల: బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కృష్ణా జిల్లా కోడూరు మండలం మందపాకల గ్రామానికి చెందిన మధురిషిత కంచికచర్లలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. బుధవారం కళాశాలకు వెళ్లి సాయంత్రం సమయంలో తనకు మెడ నొప్పి వస్తుందని భవానీపురం ఆస్పత్రికి వెళ్లతానని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి వెళ్లిపోయింది. అయితే ఆ విద్యార్థి తల్లి సాయంత్రం సమయంలో ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. దీంతో కంగారుపడిన తల్లి రెడ్డమ్మ కాలేజీకి వచ్చి విచారించింది. అనంతరం తమ బిడ్డ కనిపించటం లేదని కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక తనిఖీ తప్పనిసరి

పెడన: ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందని, దీని ముఖ్య ఉద్దేశం బడిఈడు పిల్లలకు ఉచిత విద్యను అందించడమేనని సమగ్ర శిక్ష జిల్లా ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ అబ్దుల్ సుబాన్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుబాన్ మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు భాగస్వాములేనని చెప్పారు. సామాజిక తనిఖీ అంశాలను వివరించారు. ఎంఈఓ మెటల్దారాణి, మండల ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎండీ రఫిఉల్లా, హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ల్యాండ్ రిఫార్మ్స్ తహసీల్దార్‌గా మల్లికార్జునరావు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ల్యాండ్ రిఫార్మ్స్ స్పెషల్ తహసీల్దార్‌గా టి. మల్లికార్జునరావును నియమిస్తూ కలెక్టర్ పి. రాజాబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జునరావు బాపులపాడు తహసీల్దార్‌గా పని చేస్తూ 104 రోజుల పాటు అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఆయన విధులు నిర్వహిస్తామని రిపోర్టు ఇవ్వడంతో కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న ల్యాండ్ రిఫార్మ్స్ విభాగానికి స్పెషల్ తహసీల్దార్‌గా కలెక్టర్ నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

30 నుంచి కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాలు

మచిలీపట్నంటౌన్: ఆజాద్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంతి మహోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఉదయం 8 గంటలకు దేవాలయం నుంచి 108 క్షీర కలశాలతో ఉషఃకాల యాత్ర నిర్వహిస్తామన్నారు. 108 సువర్ణ పుష్పాలతో అమ్మవారికి పూజ జరుగుతుందని చెప్పారు. మే 1వ తేదీన ధనలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారికి, 2వ తేదీన సరస్వతిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

మోపిదేవిలో ప్రచారభేరి

మోపిదేవి: పేదలపై భారాన్ని మోపుతూ దేశ సంపదను మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని సీపీఐ తీవ్రంగా విమర్శించింది. ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు చేపట్టిన ప్రచార భేరి గురువారం సాయంత్రం మోపిదేవికి చేరుకుంది. సీపీఐ నాయకులు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోదీ పాలన అంబానీ, ఆదానీలకే మంచి రోజులు తెచ్చిందని ఆరోపించారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలు పెనుభారంగా మారాయని, దేశ సంపద కార్పొరేట్లకు కట్ట పెడుతూ మతోన్మాద పోకడలతో లౌకికవాదుల అణచివేతే లక్ష్యంగా సాగుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. నాయకులు అడ్డాద ప్రసాద్ బాబు, తాతయ్య, మల్లుపెద్ది బోసు, సీపీఎం నుంచి యద్దనపూడి మధు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



బందరు 28వ డివిజన్‌లో సీఎం జగనన్న స్టిక్కర్‌ను అంటిస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో సలార్‌దాదా తదితరులు



కృత్తివెన్నులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మా మేలులు కోరుతూ అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల ద్వారా మా జీవితాల్లో వెలుగులు నిండాయని పలువురు మహిళలు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం నగరంలోని 28, 46 డివిజన్లలో నిర్వహించారు. 28వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ జిల్లా కన్వీనర్ కరార్ మూసవి, కార్పొరేటర్ షేక్ షాహీనా, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గతంలో చంద్రబాబు

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మహిళలు

ప్రభుత్వం చేసిన మోసాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తేడాను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేసి ప్రజల అనుమతితో వారి గృహాలపై, సెల్‌ఫోన్లపై సీఎం జగన్ చిత్రంతో ఉన్న స్టిక్కర్లను అంటించారు. 46వ డివిజన్‌లో కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ బత్తిన వాసు, 46వ డివిజన్ సచివాలయ కన్వీనర్లు సత్తెనపల్లి శ్రీనివాసరావు, జగన్, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలిపారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

కృత్తివెన్ను: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కృత్తివెన్ను మండలంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రశ్నలు అడిగి నమోదు చేసుకున్నారు. అనంతరం ప్రజల అనుమతితో ఇంటి తలుపులకు, సెల్‌ఫోన్లకు జగనన్న చిత్రంతో ఉన్న స్టిక్కర్లను అంటించారు. తమకు అందిన పథకాలను స్థానిక మహిళలు వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కృత్తివెన్ను పంచాయతీలో జరుగుతున్న ఈ కార్యక్రమం గురువారంతో ముగిసిందని జెడ్పీటీసీ మైల రత్నకుమారి తెలిపారు. మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపను సందర్శించి ప్రజలకు జరిగిన మేలులను వివరిస్తూ వారికి ఇంకా కావాల్సిన అవసరాలను తెలుసుకుంటున్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం

- జగన్‌తోనే సంక్షేమ పాలన
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- చల్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

చల్లపల్లి: చంద్రబాబు తాజా సభల్లో మళ్లీ జాబు రావాలంటే బాబు రావాలని నినాదాలు చేయించుకోవడం హాస్యాస్పదంగా ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం సాయంత్రం చల్లపల్లి గ్రామ సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని పేదలకు వివరించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని, వైద్య శాఖలో వేలాది ఉద్యోగాలు భర్తీ చేశారని చెప్పారు. చంద్రబాబు ఇంటికో ఉద్యోగమని చెప్పి మాట తప్పారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న నేపథ్యంలో తమకు ప్రతి గడపలో పేద కుటుంబాల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, రానున్న పాతికేళ్లు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని పేదలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు డొక్కు నాగేశ్వరరావు, గొరిపర్తి సురేష్ బాబు, తోట శ్రీనివాసరావు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, డైరెక్టర్లు అబ్దుల్ అర్షద్, మోతుకూరి కొండలు, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు, శీరం వెంకట సత్యన్నారాయణ, పేరం నాగిరెడ్డి, అరజా శివ శంకర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రోజా బందరు రాక

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక, క్రీడల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కె రోజా శుక్రవారం మచిలీపట్నం రానున్నారు. విజయవాడ నుంచి బయలుదేరి ఉదయం 9.15 గంటలకు మచిలీపట్నంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. అతిథిగృహంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాలకు సంబంధించి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మచిలీపట్నంలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులతో పాటు నగరంలోని స్టేడియం నిర్మాణానికి సంబంధించిన స్థల పరిశీలన చేస్తారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి నిర్దేశించిన ఎనిమిది అంశాల లక్ష్యాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, స్పందన అర్జీలు తదితర అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జిల్లా ప్రగతి వివరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనీమియాతో బాధపడుతున్న గర్భిణులు, కిషోర బాలికలు, పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో గ్రామంలో నెలలో రెండు సార్లు వైద్యబృందాలు 104 వాహనాల ద్వారా సందర్శించి బీపీ, షుగర్ వంటి వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, వైద్యసలహాలు అందించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతలకు నూరుశాతం కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ పథకం ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల భవనాలు, తరగతి గదుల మరమ్మతులు పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. జగనన్న విద్యా కానుక పంపిణీకి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. జేసీ అపరాజితసింగ్, డీఎంహెచ్‌ఓ గీతా బాయి, డీఈఓ తాహెరాసుల్తానా, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, సీపీఓ వై. శ్రీలత, డీఎల్‌డీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి

ముడా వైస్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

పెడన: బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా రిజిస్టరు పుస్తకాలు నిర్వహించాలని పెడన అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి, ముడా వైస్ చైర్‌పర్సన్ కె. రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి. మధుసూదనరావుతో కలిసి బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజ్యాలక్ష్మి మాట్లాడుతూ విధుల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దని, ఎన్నికల నిర్వహణ మా బాధ్యత కాదని తప్పించుకోవద్దని హెచ్చరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. అప్పగించిన పని పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్‌ఓలు తప్పనిసరిగా రిజిస్టర్ పుస్తకాలు నిర్వహించాల్సి ఉందన్నారు. మళ్లీ సమావేశానికి పూర్తి స్థాయిలో రిజిస్టరు పుస్తకాలను సిద్ధం చేసుకోవాలని, వాటిల్లో ఫారాల గురించి వివరాలు నమోదు చేసి ఉండాలన్నారు. అలాగే మీ పరిధిలో ఓటరు ఐడీ కార్డులకు ఆధార్ అనుసంధానం ఇంకా ఏమైనా ఉంటే వాటిని కూడా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 96 శాతం పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన నాలుగు శాతం కూడా అస్సలు ఆ ఓటరు ఉన్నది లేనిది విచారణ చేసి తెలుసుకుంటే వంద శాతం పూర్తవుతుందన్నారు. నాన్‌లోకల్ ఓటర్ల గురించి పూర్తి స్థాయిలో విచారణ చేయాలని చెప్పారు. ఇలాంటి వారు ఎంత మంది ఉన్నారనే విషయాన్ని ఎన్నికల సంఘం పూర్తి సమాచారం ఇచ్చిన నేపథ్యంలో మీరు కేవలం విచారణ చేసి నివేదిక మాత్రమే తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆర్ఐ మణికుమార్, సీనియర్ అసిస్టెంట్ శివకుమార్, టీపీఓ ఏసుబాబు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చల్లపల్లిపై అవనిగడ్డ జట్టు విజయం

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాలలో మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివనాగరాజు ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల క్రికెట్ పోటీలు మూడో రోజు గురువారం ఆసక్తికరంగా సాగాయి. నిర్వాహకులు యడ్ల ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం జరిగిన పోటీల్లో కోసూరువారిపాలెం జట్టుపై మెరకనపల్లి జట్టు విజయం సాధించిందని చెప్పారు. తొలుత బ్యాటింగ్ చేసిన మెరకనపల్లి జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోసూరువారిపాలెం జట్టు 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 110 పరుగులు మాత్రమే చేయగలిగింది. మెరకనపల్లి జట్టులో పల్లపు గిరీష్ 22 పరుగులు చేసి రెండు వికెట్లు తీయడంతో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కిందన్నారు. సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో చల్లపల్లికి చెందిన ఇస్లాంనగర్ జట్టు 10 ఓవర్లలో 73 పరుగుల చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అవనిగడ్డకు చెందిన తుంగపల్లెమ్మ తల్లి జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి విజయం సాధించిందని చెప్పారు. అవనిగడ్డ జట్టులో బచ్చు ప్రశాంత్ ప్రతిభ కనపర్చి 46 పరుగులు చేయడంతో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ అవార్డులను నిర్వాహకులు కారుమూరి శివనాగరాజు, మలిశెట్టి శ్రీనివాసరావు వారికి అందచేశారు.

● అరుణకాంతులు



నాగాయలంక కృష్ణానదీ తీరం శ్రీరామపాద క్షేత్రం వద్ద ఆకాశం అరుణకాంతులీనింది. సూర్యాస్తమయం వేళ గురువారం సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు ఆకాశం ఎరుపురంగు పులుముకున్నట్లుగా కనిపించింది. శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల మీదుగా, కృష్ణమ్మ విగ్రహం కలశంపై భానుడు అస్తమిస్తుండగా సూర్య కిరణాలు కృష్ణమ్మ నీటిని స్వర్ణ శోభితం చేశాయి.
– నాగాయలంక

రాజేశ్వరమ్మ మృతికి వసంత సంతాపం

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు సతీమణి రాజేశ్వరమ్మ మృతికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ వసంత నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం

బంటుమిల్లి: స్థానిక షిర్డీ సాయి మందిర ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఐలూరి జై కిషోర్ శిష్య బృందం ఉదయం పలు రకాల పంచామృతాలతో స్వామివారి ప్రధానమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, నవగ్రహ హోమం, పూర్ణాహుతి జరిగాయి. సాయంత్రం దీపాలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు.

సత్తాచాటిన అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల



కె మౌనిక లక్ష్మీ, ఎస్ గాయత్రి, ఎన్ శ్వేత, నాగినేని శ్రావ్యశ్రీ, తక్కెళ్ల తేజస్వి, బచ్చు జాస్మిత, బుద్ధు శ్రీవైష్ణవి, బట్టు జాస్మిక

అవనిగడ్డ: ఇంటర్ ఫలితాల్లో అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సెకండియర్ ఫలితాల్లో జిల్లాలో 3వ స్థానం, ఫస్టియర్ ఫలితాల్లో 4వ స్థానంలో నిలిచారు. సెకండియర్‌లో 153 మందికి 98 ఉత్తీర్ణత సాధించి 64.05 శాతం, ఫస్టియర్‌లో 132కి 65 మంది పాసై 49.24 శాతం సాధించారు. సెకండియర్ బైపీసీలో కె. మౌనిక లక్ష్మీ 1000కి 963 మార్కులు, ఎంపీసీలో ఎస్. గాయత్రి 1000కి 939 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. సీఈసీలో ఆర్‌పీ సీతు 1000కి 766, హెచ్‌ఈసీలో పి. హరిత 100కి 893, ఏఅండ్‌టీ ఒకేషనల్‌లో బి. నాగబాబు 1000కి 878 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో ఎన్. శ్వేత 470కి 444 మార్కులు, బైపీసీలో నాగినేని శ్రావ్యశ్రీ 470కి 404 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు.

ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల ప్రభంజనం

ఇంటర్ ఫలితాల్లో స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. సెకండియర్‌లో 417 మంది విద్యార్థులకుగాను 401 మంది ఉత్తీర్ణులై 96 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఫస్టియర్‌లో 377కి 330 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. సెకండియర్ ఎంపీసీలో తక్కెళ్ల తేజస్వి 1000కి 988 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, బండ్రెడ్డి ఇందుజ 984 మార్కులతో ద్వితీయస్థానం, బడుగు దీప్తి 980 మార్కులతో తృతీయస్థానంలో నిలిచింది. భావిరెడ్డి ప్రభు రజిత 978 మార్కులు, దేసు సుస్మిత 978 మార్కులు సాధించారు. సీఈసీలో బచ్చు జాస్మిక 1000కి 939తో ప్రథమ స్థానం, పర్చూరి శ్రీవల్లి 938 మార్కులు సాధించింది. ఫస్టియర్ ఎంపీసీలో బుద్ధు శ్రీవైష్ణవి 470కి 454 మార్కులతో ప్రథమ స్థానంలో గంటా రమ్య 454 మార్కులతో ద్వితీయస్థానం, సీఈసీలో బట్టు జాస్మిక 500కి 476 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. పొన్నం భావన 476, కొక్కిలిగడ్డ నాగశ్రీ 472 మార్కులు సాధించింది.

బొడ్డు నాగయ్య ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



నిదాతస్నీమ్, వీణం యుగంధర్, పేరక సాయి హర్షిత, వాసా ఝాన్సీ, పుట్టి నిఖిత



కారె నిఖిత, సీహెచ్ ప్రసన్న

పెడన: పెడన మండలంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 26 మంది పరీక్షలకు హాజరుకాగా 16 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆర్ట్స్ గ్రూపుల్లో పది మందికి ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో నిదాతస్నీమ్ విద్యార్థిని వెయ్యి మార్కులకు 956 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలలో టాపర్‌గా నిలిచింది. ఎంపీసీలో వీణం యుగంధర్ 899 మార్కులు, సీఈసీలో షేక్ అయేషా 719 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో సైన్సు గ్రూపుల్లో 27 మందికి 8 మంది, ఆర్ట్స్ గ్రూపుల్లో 8 మందికి నలుగురు ఉత్తీర్ణులయ్యా రు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పేరక సాయి హర్షిత 434/470 మార్కులు, బైపీసీలో వి. ఝాన్సీ 279/ 440 మార్కులతో టాపర్‌గా నిలిచారు.

● బలిపర్రులోని గురుకుల పాఠశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి సీనియర్ ఇంటర్‌కు 48 మంది హాజరుకాగా 42 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 48 మందికి 33 మంది ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్ సీఈసీలో పుట్టి నిఖిత 930 మార్కులతో ప్రథమ స్థానంలో, కారె నిఖిత 912 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. సీనియర్ ఇంటర్‌లో ఎంఈసీలో చట్టి ప్రసన్న 911 మార్కులతో, గరికిముక్కు భవ్యశ్రీ 899 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

వాగ్దేవి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు



సూరిశెట్టి తులసీ సౌమ్య



పి. మణికంఠ

బంటుమిల్లి: బంటుమిల్లి వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సూరిశెట్టి తులసీ సౌమ్య 1000 మార్కులకు గాను 987, సీహెచ్ హేమశ్రీ 984, బైపీసీలో ఎ. ఇందు 984, డి. ఉషా 967, సీఈసీలో వలవల మమత 958, అమ్మిశెట్టి జయశ్రీ 954, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో పి. మణికంఠ 470 మార్కులకు 464, వీఎస్ఎల్‌వీ నాగేశ్వరి 462, బైపీసీలో వై. కృష్ణశ్రీ 416, కె. జ్యోతి 411, సీఈసీలో పి. సూర్యతేజ 408, జి. శ్రీవల్లి 406 మార్కులు సాధించారని వివరించారు.

గురుకుల కళాశాల విద్యార్థుల విజయ దుందుభి



మోహన్‌రాజు



రాజేంద్ర

మోపిదేవి: స్థానిక ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ గురుకుల ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారని కళాశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 20 మందికి 18 మంది ఉత్తీర్ణులయ్యారు.ఎస్. మోహన్‌రాజు 1000కి 975 మార్కులు సాధించాడు. బైపీసీలో ఏడుగురికి ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా 930 మార్కులు సాధించారు. సీఈసీలో 21 మందికి 13 మంది విజయం సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 35 మందికిగాను 33 మంది, బైపీసీలో 17 మందికి 16 మంది, సీఈసీలో 27 మందికి 25 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్‌లో నగర విద్యార్థుల ప్రభంజనం



కె. రిజ్వానా

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 14 జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 2,371 మంది హాజరుకాగా 1699 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,124 మంది హాజరుకాగా వీరిలో 1,673 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం 71.65 శాతం, ద్వితీయ సంవత్సరం 78.76 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కె. రిజ్వానా ఎకౌంట్స్, ట్యాక్సేషన్ గ్రూపులో 985 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనంద కుమార్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఓ విద్యార్థి ఇంటి నుండి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం ఎన్జీవోస్ కాలనీకి చెందిన పంచపర్వాల తన్వీర్ వెంకట ప్రభాస్ నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు రాయగా బుధవారం వాటి ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షల్లో ప్రభాస్ తప్పడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. స్నేహితులు, బంధువులు వద్ద కుటుంబ సభ్యులు విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. ప్రభాస్ తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కృత్తివెన్ను: మద్యం షాపు వద్ద జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం కృత్తివెన్ను మండలం చినపాండ్రాక సమీపంలో ఈ ఘటన జరిగింది. కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చినపాండ్రాక పంచాయతీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పిల్లి వెంకటేశ్వరరావు, కోళ్ల రమేష్ మద్యం తాగేందుకు మద్యం షాపువద్దకు వచ్చారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో ఇరువురూ ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వరరావు తన వద్ద ఉన్న కత్తితో రమేష్‌పై దాడి చేయడంతో రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

30న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

మచిలీపట్నంటౌన్: రాజుపేట పెద్దవీధి రామాలయం సెంటర్‌లో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర సరస్వతి సమేత రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 30వ తేదీన ఉదయం 7.32 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 11.30 గంటలకు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ 36వ డివిజన్ కన్వీనర్ జవ్వాది రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిస్తారు.